



కడియం పల్ల వెంకన్న నర్సరీలో నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ...

రూరల్ బరిలో నిలిచేదెవరో..?

- అభ్యర్థుల ఎంపికపై పార్టీల మల్లాగుల్లాలు
- శ్రేణుల్లో నెలకున్న ఉత్కంఠ






ప్రజాశక్తి - కడియం

ఎన్నికలు సమీపిస్తుండటంతో రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం నుంచి ఎవరు పోటీ చేస్తారనే విషయం సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఒకపక్క అధికార పక్షానికి అభ్యర్థిని ఖరారు చేయడం కత్తి మీద సాములా మారింది. మరోపక్క ప్రతిపక్షానికి పొత్తులో భాగంగా సీటు ఎవరికి దక్కుతుందో అనే ఉత్కంఠ నెలకొంది. రూరల్ నియోజకవర్గంలో కడియం, రాజమహేంద్రవరం రూరల్ మండలాలతోపాటు, రాజమహేంద్రవరం నగర పాలక సంస్థకు చెందిన 8 వార్డులు ఉన్నాయి. రెండు లక్షల యాభై వేలు పైచిలుకు ఓటర్లు ఉన్నారు. వీటిలో బిసి సామాజిక వర్గానికి చెందిన ఓట్లు అధికంగా ఉన్నాయి. స్థానిక నాయకులకు కొదవ లేకపోవడంతో వైసిపి సరికొత్త ఎత్తుగడతో అభ్యర్థులను ఎంపిక చేసేందుకు సన్నాహాలు చేస్తుంది. ఎవరిని నిలబెడితే, ఎవరు అలకబూనుతారో అనే సందిగ్ధంలో ఆచీతూచి అడుగులు వేస్తోంది. అధికార పార్టీ కావడంతో వైసిపిపై ప్రజల్లో సహజంగా ఉండే కొంత వ్యతిరేకతను అధిగమించడానికి, సామాజిక వర్గాల కూర్పును దృష్టిలో పెట్టుకుని అభ్యర్థులను ఎంపిక చేయాలనే ఆలోచనలో ఉన్నట్లు పార్టీ శ్రేణులు అభిప్రాయ పడుతున్నాయి. ఒకపక్క బిసి ఓట్లను మరోపక్క కాపుల ఓట్లను సాధించేందుకు అధికార పార్టీ వ్యూహాలను రచిస్తోంది.

2019లో రామచంద్రపురం నుంచి ఎంఎల్ఎగా విజయం సాధించిన చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ ఈ నియోజక వర్గం నుంచి పోటీ చేస్తారనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అయితే ఇప్పటి వరకూ ఈ స్థానం నుంచి రూరల్ వైసిపి కో-ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ పోటీ చేస్తారని ఆ పార్టీ శ్రేణులు ఉన్నాయి. అయితే ఉన్నఫలంగా ఆయనను పక్కన పెట్టి నియోజకవర్గానికి సంబంధం లేని వ్యక్తిని పోటీలో దింపడాన్ని స్థానిక నేతలు జీర్ణించుకోలేకోతున్నారు. రూరల్ నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి చందన నాగేశ్వర్ నిరంతరం ప్రజల్లోనే ఉన్నారు. ప్రజలకు ఏ కష్టం వచ్చినా నేనున్నాను అంటూ ఆదుకుంటున్నారు. అయితే స్థానిక నాయకత్వాన్ని కలుపుకుని వెళ్లడంలో వెనకబడ్డారనే అభిప్రాయం స్థానిక నేతల్లో ఉంది. ఇటీవల వైసిపి శ్రేణులు ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసి చందన నాగేశ్వర్ పట్ల అయిష్టతను వ్యక్తం చేసినట్లు సమాచారం. అయితే అభ్యర్థిత్వాన్ని నియోజకవర్గానికి చెందిన వారికే కేటాయించాలనే డిమాండ్ ఇక్కడ బలంగా వినిపిస్తోంది. రూరల్ టిక్కెట్టును వైసిపి నుంచి డిసిసిబి ఛైర్మన్ ఆకుల వీర్రాజు, వైసిపి రాష్ట్ర కార్యదర్శి గిరిజాల బాబు, బిసి సంక్షేమ సంఘం జాతీయ నాయకురాలు డాక్టర్ అనుసూరి పద్మలత, వైసిపి నాయకుడు రావిపాటి రామచంద్రరావు ఆశిస్తున్నారు. వీరెవ్వరికీ కాకుండా స్థానికేతరుడైన వేణును పోటీలో నిలిపితే ఏమేరకు వీరు సహకరిస్తారనేది ప్రశ్నార్థకంగానే ఉంది.

ఇదిలావుంటే ప్రతిపక్ష టిడిపికి ఈ నియోజకవర్గం కంచుకోటగా ఉంది. గత ఎన్నికల్లో రాష్ట్రమంతా జగన్ గాలి వీచినా రూరల్ నియోజకవర్గంలో మాత్రం ఆ గాలి వీయలేదు. ఇక్కడ నుంచి మాజీ మంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి విజయం సాధించారు. అయితే ఈ ఎన్నికల్లో టిడిపి, జనసేన పార్టీల కూటమిగా ఏర్పడ్డాయి. ఈ కూటమి పొత్తులో ఈ టిక్కెట్టు ఏ పార్టీకి దక్కుతుందోనన్న ఉత్కంఠ నెలకొంది. గత రెండు పర్యాయాల నుంచి ఇక్కడ గోరంట్ల విజయం సాధించారు. టిడిపి అధినేత చంద్రబాబు సిటింగ్ ఎంఎల్ఎలకు టికెట్లు ఇస్తామని గతంలో ప్రకటించారు. ఆ ప్రకటన ద్వారా అయితే ఈ టిక్కెట్టు తిరిగి గోరంట్లనే వరించే అవకాశాలు ఉన్నాయి. ఆ ధీమాతోనే గోరంట్ల నేటికీ ఉన్నారు. అయితే గత ఎన్నికల్లో ఇదే నియోజక వర్గం నుంచి జనసేన నుంచి పోటీ చేసిన జనసేన పార్టీ ఉమ్మడి తూర్పు గోదావరిజిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంఎల్‌సి కందుల దుర్గేష్ పొత్తులో భాగంగా జనసేనకు టిక్కెట్టు ఖరారు అవుతుందనే అంచనాలో ఉన్నారు. ఏదిఏమైనా అభ్యర్థులు ఎవ్వరనేది మరికొద్ది రోజుల్లోనే స్పష్టం అయ్యే అవకాశాలు ఉన్నాయి.

న్యూ ఇయర్ సందడి

- వస్త్ర దుకాణంలో కొనుగోళ్ల జోష్
- ఆఫర్లు ప్రకటించిన వ్యాపారులు



రాజమహేంద్రవరంలో జనంతో కిక్కిరిసిన మెయిన్ రోడ్డు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

జిల్లాలో న్యూ ఇయర్ సందడి నెలకొంది. 2024కు యువత ఉత్సాహంగా స్వాగతం పలికింది. న్యూ ఇయర్ నేపథ్యంలో ఆదివారం మధ్యాహ్నం నుంచి వస్త్ర వ్యాపారాలు, స్వీట్స్ షాపులు, బిర్యానీ పాయింట్‌లు కిట కిటలాడాయి. జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరంలోని మెయిన్ రోడ్డు కొనుగోలుదారులతో సందడి నెలకొంది. న్యూ ఇయర్ నేపథ్యంలో వ్యాపారులు భారీ ఆఫర్లతో ప్రజలను ఆకర్షించారు. స్పాట్ గిఫ్టు, లక్కీ డ్రా కూపన్లు అందించి కొనుగోలు దారులను ఆకట్టుకున్నారు. బస్‌కాంప్లెక్స్ ఏరియాలోని శుభమస్తు, మెయిన్ రోడ్డులోని బిఆర్‌కె, గోకవరం బస్టాండ్ వద్ద ఉన్న సౌత్ ఇండియా షాపింగ్ కాంప్లెక్స్ తదితర ప్రముఖ వస్త్ర దుకాణాల ఎదుట లక్కీ డ్రా కూపన్లు నింపేందుకు సైతం కొనుగోలుదారులు క్యూ కట్టారు. మరోవైపు ఫుడ్ వ్యాపారులకు డిమాండ్ పెరిగింది. రెస్టారెంట్లు, బిర్యానీ పాయింట్లు నిర్వహించే వ్యాపారులు ప్రత్యేక ఆఫర్లను ప్రకటించారు. బిర్యాని కొంటే అరలీటరు కూల్ డ్రింక్ బాటిల్, రెండు బిరియానీలు కొంటే లీటరన్నర బాటిల్ ఉచితమంటూ రెస్టారెంట్ల నిర్వాహకుతుల ఆఫర్లు ప్రకటించారు. కొన్ని రెస్టారెంట్లలో బిర్యానీ పార్శిళ్లపై రూ.50 నుంచి రూ.100 వరకు రేట్లు తగ్గించారు. నాన్‌వెజ్ ఐటమ్స్ విషయంలో ప్రత్యేకంగా టెంట్లు వేసిన విక్రయాలు చేపట్టారు. కేకులు కూడా అరకేజీ నుంచి 5 కేజీల వరకు జోరుగా విక్రయాలు జరిగాయి. వీటికి కూడా ప్రత్యేక ఆఫర్లు ఇచ్చారు. బిర్యాని పాయింట్, హోటళ్ళు కూడా 31వ తేదీ రాత్రి 1వ తేదీ కూడా భారీ ఎత్తులో డిస్కౌంట్లు, భోజన ప్రియులకు రుచికరమైన ఆహారపదార్ధాల ఆఫర్లను కూడా ప్రకటించారు. అదేవిధంగా పండ్లకు డిమాండ్ పెరగటంతో వ్యాపారులు ధరలు పెంచారు. యాపిల్స్, కమలాల ధరలు భారీగానే పెంపుదల చేశారు. వేమగిరిలోని పూల మార్కెట్లోనూ సందడి నెలకొంది. దీంతో రిటైల్ వ్యాపారులు ధరలు పెంచారు. రాజమహేంద్రవరంలోని జాంపేట, కంబాల చెరువు సెంటర్‌లలోని పూల దుకాణాలలో పూలబోకేలు చిన్నవి అయితే రూ.150, సైజులను బట్టి రూ.450 నుంచి రూ.600 వరకు విక్రయాలు జరిగాయి. చామంతులు కేజీ రూ.150 నుంచి 250కు చేరాయి. కనకాంబరాలు కేజీ రూ.200 నుంచి ఒక్కసారిగా 400కు పెంచటంతో కొనుగోలు దారులు నిరాశ చెందారు. కేజీ రూ.250 ఉండే సూదిమల్లి ఆదివారం రూ.600కు పెరిగి పోయింది. కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ రంగులు వేసేందుకు ఇప్పటికే అనేక రంగులు అమ్మకాలు పెరిగాయి. మద్యం అమ్మకాలు సైతం జోరందుకున్నాయి. రాష్ట్ర ప్రభుత్వమే అర్ధరాత్రి 12 గంటలకు మద్యం షాపులకు, ఒంటి గంట వరకూ బార్లకు అనుమతి ఇవ్వడంతో మందుబాబులు భారీగా క్యూ కట్టారు.

1 గంట వరకే వేడుకలకు అనుమతి



నూతన సంవత్సర వేడుకలు అర్ధరాత్రి ఒంటిగంటకు ముగించాలి. డిజె సౌండ్ సిస్టమ్ ఏర్పాటు, నృత్యాలకు ఎటువంటి అనుమతులు లేవు. బహిరంగ ప్రదేశాల్లో కేకలు కట్ చేయడం నిషేధం. మద్యం దుకాణాలు, బార్‌లను నిర్ణీత సమయంలో మూసివేయాలి. సైలన్సర్లు తీసి బైక్‌లపై వేగంగా వెళ్లినా, గుంపులుగా రోడ్లపై తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేసినా కఠిన చర్యలు తప్పవు. ప్రతీ పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రత్యేక తనిఖీలు చేస్తాము. నియమ నిబంధనలు పాటించి పోలీసు శాఖకు సహకరించాలి.

- పి. జగదీష్, ఎస్‌పి, తూర్పుగోదావరి జిల్లా.

6వ రోజుకు మున్సిపల్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి - కొవ్వూరు రూరల్

మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె ఆదివారానికి 6వ రోజుకు చేరింది. అవుట్ సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలి, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కార్మికులు అర్ధనగ్న ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభకు ప్రధాన కార్యదర్శి పూజారి వాసు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎం.సుందర బాబు మాట్లాడుతూ సమ్మె చేస్తున్న కార్మికుల డిమాండ్స్ పరిష్కారం చేయకుండా ప్రభుత్వం పోటీ కార్మికులను పెట్టమని ఆదేశాలు జారీ చేయడం దారుణమన్నారు. ప్రభుత్వానికి మున్సిపల్ కార్మికుల పట్ల చిత్త శుద్ధి ఉంటే ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. గత ఐదేళ్లగా ప్రభుత్వం ఏదో ఒక రోజు బటన్ నొక్కి పర్మినెంట్ చేస్తుందని, లేదా సమాన పనికి సమాన వేతనం ఇస్తాదనే ఆశతో కార్మికులు ఎదురుచూస్తున్నారని అన్నారు. కమిటీ అధ్యక్షుడు భూపతి రవీంద్ర మాట్లాడుతూ ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించని కారణంగానే కార్మికులు సమ్మెలు చేయాల్సి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కళ్యాణ్, రాజేష్, మీసాల ప్రేమ్, మీసాల జ్యోతి, కారంకి ప్రసాద్, ముత్యాల శ్రీను, వడ్డాది శ్యామ్, ఎం.శకుంతల, రాజన్న, అప్పారావు, మాండ్రు సుధీర్, మీసాల కిషోర్ తదితరులు నాయకత్వం వహించారు.



మున్సిపల్ కార్యాలయం వద్ద అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న కార్మికులు




వైఎస్ఆర్ పింఛన్లు రూ.3 వేలకు పెంపు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

సామాజిక భద్రత కింద అందచేస్తున్న వైఎస్ఆర్ పింఛన్ కానుక జనవరి ఒకటి నుంచి రూ.3 వేలకు ప్రభుత్వం పెంపుదల చేసిందని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఫింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధుల సమక్షంలో జనవరి 1 నుంచి 6 వరకూ నిర్వహిస్తామని చెప్పారు. జనవరి 1న నిడదవోలు అర్బన్, 2న నిడదవోలు రూరల్, తాళ్లపూడి, గోకవరం, దేవరపల్లి మండలాల్లోనూ, 3న అనపర్తి, కడియం, సీతానగరం, 4న పెరవలి, బిక్కవోలు, చాగల్లు, కొవ్వూరు రూరల్, కొవ్వూరు అర్బన్, రాజమహేంద్రవరం రూరల్, రాజమహేంద్రవరం అర్బన్, రాజానగరం, 5న గోపాలపురం, రంగంపేట, 6న కోరుకొండ, నల్లజర్ల, ఉండ్రాజవరం ఈ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు చెప్పారు. జిల్లాలో ప్రస్తుతం జిల్లాలో 18 రకాల పెన్షన్లు 2,44,840 ఉన్నాయని, వీటి నిమిత్తం ప్రస్తుతం రూ.67,57,19,750 పంపిణీ చేస్తున్నామని తెలిపారు. రూ.3 వేలు చొప్పున రూ.72, 66,42,000లను లబ్ధిదారులకు అందిం చనున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ఉన్న పింఛన్లతోపాటు, కొత్తగా మరో 1,000 పింఛన్లు మంజూరు అయ్యాయని తెలిపారు. వీటితో మొత్తం పింఛన్‌దారుల సంఖ్య 2.54 లక్షలకు చేరిందన్నారు.

కార్టూ'నిజం'



3న అంగన్‌వాడీల చలో కలెక్టరేట్

ప్రజాశక్తి - యంత్రాంగం

అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె ఆదివారం నాటికి 20 రోజుకు చేరుకుంది. **రాజమహేంద్రవరం** సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద రిలే నిరాహర దీక్ష చేపట్టారు. నిరసన వ్యక్తం చేస్తూ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సంఘీభావం తెలుపుతూ కార్యదర్శి ఎన్.రాజా ఆందోళనలో పాల్గొన్నారు ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి టి.బేబిరాణి మాట్లాడారు. అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించకపోతే గత పాలకులకు పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు. చర్చలకు పిలిచి వేతనాలపై అసత్యాలు మాట్లాడుతున్నారన్నారు. అంగన్‌వాడీలకు ఇచ్చే వేతనాల్లో ఆంధ్రప్రదేశ్ దేశంలో ఆరో స్థానంలో ఉందని, వాస్తవాలను పక్కనపెట్టి అందరికంటే ఎక్కువ ఇస్తున్నామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. 11 డిమాండ్లలో 8 డిమాండ్లు నెరవేర్చామని మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పడంలో వాస్తవం లేదన్నారు. వేతనాలు పెంపు, గ్రాడ్యుటీ అమలు నెరవేర్చకుండా అన్ని డిమాండ్లు నెరవేర్చామని చెప్పడం మంత్రి స్థాయికి సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు సిహెచ్.మాణిక్యాంబ, సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.సుందరబాబు, బి.రాజులోవ, తెలుగు మహిళ నాయకులు, ఐద్వా జిల్లా నాయకులు టి.సావిత్రి, సిఐటియు సీనియర్ నాయకులు టిఎస్.ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. **కొవ్వూరు రూరల్** స్థానికంగా జరుగుతున్న సమ్మె శిబిరంలో అంగన్‌వాడీలు రిలే నిరహారదీక్షలను కొనసాగించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సిహెచ్. మాణిక్యాంబ, సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఎం.సుందరబాబు పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడం తోనే రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 3న చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని చేపడుతున్నామని, అంగన్‌వాడీలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి యూనియన్ నాయకులు సిహెచ్‌విఎల్. పుష్పావతి, ఎ.నరసమాంబ, బి.పద్మజ, బి.వసంత, పి.మణి ముత్యం, వి.శ్రీదేవి, చిన్న లక్ష్మి తదితరులు నాయకత్వం వహించారు. **గోకవరం** స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద జరుగుతున్న అంగన్‌వాడీల నిరసన శిబిరంలో రిలే నిరహర దీక్ష కొనసాగింది. తమ న్యాయమైన సమ్మెకు వైసిపి మినహా ఇతర రాజకీయ పార్టీలు, ప్రజా సంఘా లు, కార్మిక సంఘాలు అండగా నిలిచాయని నాయకు లు అన్నారు. రాబోయే రోజుల్లో వైసిపి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. **పెరవలి** స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద జరుగుతున్న అంగన్‌వాడీల రిలే నిరహారదీక్ష కొనసాగింది. ఈ సందర్భంగా యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి కె.కృష్ణవేణి మాట్లాడుతూ గత 20 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇదే మొండివైఖరితో ప్రభుత్వం తాత్సారం చేస్తే రాబోయే కాలంలో ప్రభుత్వానికి తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు బి.నాగవేణి, సిహెచ్.విశాలి, వి.నిర్మల, కన్యాకుమారి, ఎన్.శాంతకుమారి, బి.రామలక్ష్మి, పి.దుర్గలక్ష్మి నాయకత్వం వహించారు.



పెరవలిలో ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు



రాజమహేంద్రవరంలో అంగన్‌వాడీలకు మద్దతుగా పాల్గొన్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మార్చిలో ఫ్లైఓవర్ ప్రజలకు అంకితం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం నగర ప్రజలకు మోరంపూడి ఫ్లైఓవర్ బ్రిడ్జిని ఈ ఏడాది మార్చిలో అంకితం చేస్తానని ఎంపి మార్గాని భరత్ రామ్ అన్నారు. మోరంపూడి వద్ద జరుగుతున్న ఫ్లై ఓవర్ బ్రిడ్జి పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. నిర్మాణ పనుల్లో అత్యంత కీలకమైన గడ్డర్లను ఏర్పాటు చేసే పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర చరిత్రలో ప్రధాన కట్టడంగా ఈ ఎఫ్ఓబి నిలిచిపోనుందన్నారు. మోరంపూడి సెంటర్లో అనేక ప్రమాదాలు జరిగి వందలాది మంది ప్రాణాలను కోల్పోయారని, ఈ ప్రమాదాల నివారణకు ఫ్లై ఓవర్ బ్రిడ్జిను చేపట్టినట్లు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఇక్కడ ఎఫ్ఓబి నిర్మాణం మంజూరు అయ్యిందని, అయితే నాటి ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం వల్ల కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిందని గుర్తు చేశారు. త్వరలోనే నగర హైవేని ఆనుకుని ఉన్న లాలాచెరువు, దివాన్ చెరువు, బొమ్మూరు, వేమగిరి, ఓఎన్‌జిసి ఫ్యూచర్ కిడ్స్ ప్రాంతాల్లో కూడా ఎఫ్ఓబిలను మంజూరు చేయించి ఎన్నికల నాటికల్లా వాటికి శంకుస్థాపన చేస్తామన్నారు. ఈ పర్యటనలో రుడా ఛైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, రాజమహేంద్రవరం అర్బన్ వైసిపి కో-ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, సృష్టి కాంట్రాక్టు ప్రైవేటు లిమిటెడ్ డిజీఎం రామకృష్ణ, డిప్యూటీ ప్రాజెక్ట్ మేనేజర్ సురేష్ గౌడ్, ప్రాజెక్ట్ కంట్రోలర్ చెన్నకేశవ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎస్ఎఫ్ఐ 54 వ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఎస్ఎఫ్ఐ 54 వ ఆవిర్భావ దినోత్సవాన్ని నగరంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎస్‌టి బాలికల వసతి గృహంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వై.భాస్కర్ స్వాతంత్రం, ప్రజాస్వామ్యం, సోషలిజం అనే జెండాని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై.భాస్కర్, ఎన్. రాజా మాట్లాడుతూ 1970లో ఏర్పడిన ఎస్ఎఫ్ఐ నాటి నుంచి నేటి వరకూ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఉద్యమిస్తుందని అన్నారు. ఈ ఉద్యమాల్లో అనేక మంది విద్యార్థి సంఘ నేతలు తమ ప్రాణాలను త్యాగం చేశారని గుర్తు చేశారు. అధ్యాయనం, పోరాటం అనే నినాదంతో ఎస్ఎఫ్ఐ ముందుకు వెళ్తుందని, అలాగే అందరికి విద్య, ఉపాధి ప్రభుత్వమే కల్పించాలని డిమాండ్‌తో ముందుకు సాగుతుందన్నారు. నూతన జాతీయ విద్యా విధానం పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యను కాషాయీకరణ, ప్రయివేటీకరణ చేస్తుందని అన్నారు. ఈ విధానాల వల్ల పేదలు విద్యకు దూరం అయ్యే పరిస్థితులు నెలకున్నాయని అన్నారు. నూతన విద్యావిధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జనవరి 12న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి కె.జ్యోతి, కమిటీ సభ్యులు స్వేచ్ఛ, మువిల, దుర్గ, సురేష్, మరియ, తదితరులు పాల్గొన్నారు.



జెండాను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు భాస్కర్, రాజా

కిటకిటలాడిన తాళ్లపూడి...



బేకరీ వద్ద కేకుల కోసం వినియోగదారులు

ప్రజాశక్తి - తాళ్లపూడి

నూతన సంవత్సర ప్రారంభ వేడుకలు పురస్కరించుకుని మండల కేంద్రమైన తాళ్లపూడి మెయిన్ బజార్ ఆదివారం సాయంత్రం నుంచి కొనుగోలుదారులతో కిటకిటలాడింది. వివిధ రకాల రంగులు అమ్మే దుకాణాలతోపాటు ప్రత్యేక పలావ్ సెంటర్లు, వివిధ రకాల మోడల్‌తో కేకులు విక్రయానికి ప్రత్యేక షాపులను ఏర్పాటు చేశారు. రంగులు, ఫ్యాన్సీ వస్తువుల కోసం వచ్చిన మహిళలు, చిన్నారులతో షాపులు కిటకిట లాడాయి. పూల దుకాణాలు, పలావ్ సెంటర్లు, బేకరీలు యువతతో కళ కళలాడాయి.

పూలతో చంద్రయాన్-3



శ్రీ సత్యదేవ నర్సరీలో మొక్కలతో చంద్రయాన్ 3 నమూనా

ప్రజాశక్తి - కడియం

నూతన సంవత్సరానికి ఘనంగా స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేయడం సహజం. అయితే కడియం నర్సరీ రైతులు ఈ స్వాగతి ఏర్పాట్లులో ప్రతి ఏటా ఏదో ప్రత్యేకతను చాటుకుంటారు. ఈ ఏడాది యువ నర్సరీ రైతులు విన్నూత్న రీతిలో ఏర్పాటుచేసిన అద్భుత కూర్పులు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. వేలాది స్వదేశీ, విదేశీ మొక్కలతో పదుల సంఖ్యలో కూలీలు గత వారం రోజులుగా శ్రమించి వీటిని తీర్చిదిద్దారు. కడియపులంక పుల్లా ఆంజనేయులుకు చెందిన శ్రీ సత్యదేవ నర్సరీలో వేలాది మొక్కలతో చంద్రయాన్-3 ను ఎంతో అద్భుతంగా రూపొందించారు. ఈ కూర్పును తిలకించడానికి సందర్శకులు పోటీపడుతున్నారు. అదేవిధంగా పల్ల వెంకన్న నర్సరీలో ఏర్పాటు చేసిన 2024 సంవత్సరం స్వాగత ఏర్పాట్లు కూడా సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. అనేక రకాల మొక్కలతో నూతన సంవత్సరానికి శుభాకాంక్షలు తెలపుతూ ఈ కూర్పును ఆ నర్సరీ యువ రైతులు పల్ల వెంకటేష్, వినయ్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. అలాగే పుల్లా చంటియ్యకు చెందిన సత్యదేవ నర్సరీలో కూడా వేలాది మొక్కలతో రూపొందించిన ఈ నూతన సంవత్సర స్వాగత కూర్పు సందర్శకులను రా...రమ్మని ఆహ్వానిస్తున్నాయి. అలాగే జాతీయ రహదారి పక్కనున్న పుల్లా చిన సత్యనారాయణ నర్సరీలో కూడా నూతన సంవత్సర సందర్భంగా ఏర్పాటు చేసిన కూర్పులు అద్భుతంగా ఉన్నాయి. మొత్తానికి ఈ 2024 సంవత్సరానికి స్వాగతం పలకడంలో కడియం నర్సరీ రైతులు తమ మార్కును ప్రదర్శించారని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు.

క్రైస్తవ దేవాలయాలకు కేకుల పంపిణీ

ప్రజాశక్తి - పెరవలి



ఆటోల్లో తరలిస్తున్న కేక్ బాక్సులు

నూతన సంవత్సర వేడుకల సందర్భంగా నిడద వోలు నియోజక వర్గంలోని పెరవలి, ఉండ్రాజవరం, నిడద వోలు మండలాల్లో ఉన్న క్రైస్తవ దేవాల యాలకు నియోజకవర్గ టిడిపి సీనియర్ నాయకులు కుందుల వీర వెంకట సత్యనారాయణ సుమారు 800 కేకులను పంపిణీ చేశారు. ఆయా దేవాలయాలకు నాలుగు వ్యాన్లలో తరలించి అందచేశారు.

రైలు టికెట్లపై రాయితీని పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

సీనియర్ సిటిజన్స్‌కు రైలు టిక్కెట్లపై రాయితీని పునరుద్దరించాలని ప్రజా సంక్షేమ వేదిక డిమాండ్ చేసింది. ప్రజాసంక్షేమ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ఆర్యాపురం డాక్టర్ ఎబి.నాగేశ్వరరావు పార్క్‌లో ఉన్న సీనియర్ సిటిజన్స్ డేకేర్ భవనంలో నందు సీనియర్ సిటిజన్స్ అధ్యక్షులు అశోక్‌కుమార్ జైన్ అధ్యక్షతన సమావేశం జరిగింది. తొలుత ఆహ్వానితులను కార్యదర్శి మహంతి లక్ష్మణరావు వేదికపైకి ఆహ్వానించారు. వక్తలు మురపాక వీర్రాజు, కెకె.సంజీవరావు, జి.రమణయ్య, బొడ్డు బుల్లబ్బాయి, జగన్నాథం వెంకటరెడ్డి, చాగంటి లక్ష్మీనరసింహారావు మాట్లాడారు. సీనియర్ సిటిజన్స్‌కు రైల్వేలో ప్రయాణ టిక్కెట్లపై రాయితీని పునరుద్దరించాలన్నారు. జిల్లా స్థాయిలో సీనియర్ సిటిజన్స్‌కు ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు, గోరుగుంతల వరప్రసాదరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులైన సీనియర్ సిటిజన్స్ సభ్యులు ఎవరైనా సరే తమ లైఫ్ సర్టిఫికెట్ కోసం 4 గంటల నుంచి 7 గంటల వరకూ ఆర్యాపురం డాక్టర్ ఎబి.నాగేశ్వరరావు పార్క్‌లో ఉన్న సీనియర్ సిటిజన్స్ డే కేర్ భవనంలో ఉచితంగా అందిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా డిసెంబర్ నెలలో పుట్టిన సీనియర్ సిటిజన్స్‌తో కేక్ కట్ చేయించి స్వీట్ ప్యాకెట్లు అందించారు. పుట్టిన రోజు జరుపుకున్న వారిలో బండి నరేంద్రబాబు, కొమ్మన వెంకటేశ్వరరావు, వి.రామచంద్రారెడ్డి, జగన్నాథం వెంకటరెడ్డి, కొపర్తి రవీంద్రబాబు, పడాల అప్పారావు, పైలా అప్పారావు ఉన్నారు. ఈ కార్యక్రమంలో కాసాని శంకర్రావు, గడ్డం వెంకటరమణ, గంతకూర అప్పారావు, చప్పటి సత్యనారాయణ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

సారా స్థావరాలపై దాడులు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

పేరవరం గ్రామం శివారు నాటు సారా తయారుచేసి విక్రయిస్తున్నారని సమాచారం రావడంతో ఆదివారం ఎస్ఐ బి.వై.కిరణ్ కుమార్ తన సిబ్బందితో కలిసి సారా బట్టీలపై దాడులు చేశారు.. నాటు సారా తయారు చేయడానికి నిల్వ ఉంచిన 240 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి 10 ప్లాస్టిక్ డబ్బాలను స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు..

తోపులాటలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - తాళ్ళపూడి

మండల పరిధిలోని మలకపల్లి గ్రామంలో గల ఆంధ్ర ఎవాంజికల్ లూథరన్ చర్చిలో ఆదివారం జరిగిన తోపులాటలో ఒక వ్యక్తి మృతి చెందాడని తాళ్లపూడి ఎస్ఐ కె.వి.రమణ తెలిపారు. గ్రామానికి చెందిన దేశాబత్తుల రమణ(50) ఎప్పటిలాగానే ఆదివారం చర్చికి వెళ్లారు. అయితే చర్చిలో రెండు వర్గాల మధ్య గొడవ జరుగుతుండడంతో విడదీయడానికి వెళ్లిన రమణ ఊపిరాడక అస్వస్థత స్థితిలోకి వెళ్లి మరణించాడని ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

తేనెటీగల దాడిలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - రౌతులపూడి

మండల కేంద్రమైన రౌతులపూడి గ్రామానికి చెందిన మలిరెడ్డి చిట్టిబాబు (48) ఆదివారం తేనెటీగలు దాడి చేయడంతో మృతి చెందారు. మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు మతునికి భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

మండల కేంద్రమైన జగ్గంపేట గోకవరం రహదారిలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మన్యంవారిపాలెం గ్రామానికి చెందిన ఇందుమల్లి కృష్ణ బైకుపై జె. కొత్తూరు నుండి జగ్గంపేట వైపునకు వెళుతుండగా ఎదురుగా బైక్‌పై వస్తున్న ముగ్గురు యువకులు ఢీ కొట్టారు. దీంతో కృష్ణ కాలికి బలమైన గాయమైంది. క్షతగాత్రుని ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగార్జున రాజు తెలిపారు.

జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

సమాచార శాఖ డిడి నాగార్జున



ముఖాముఖి

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

జర్నలిస్టుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కాకినాడ జిల్లా సమాచార శాఖ డిప్యూటీ డైరెక్టర్ దాసరి నాగార్జున తెలిపారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా ఆధ్వర్యంలో త్వరలోనే అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులందరికీ జిల్లాలో ఇళ్ల స్థలాలు మంజూరు అవుతాయని చెప్పారు. ఇంకా జర్నలిస్టుల కోసం అమలవుతున్న వివిధ కార్యక్రమాలను ఆయన వివరించారు.

జర్నలిస్ట్ హౌస్ సైట్స్ పథకం గురించి చెప్పండి.

అక్రిడిటేషన్ కలిగిన జర్నలిస్టులకు రాష్ట్ర ప్రభుత్వం ఇళ్ల స్థలాలను ఇవ్వనుంది. ఇప్పటికే జి.ఒ. కూడా విడుదల అయింది. ఈ మేరకు కాకినాడ జిల్లాలో ఇప్పటి వరకు 282 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఇంకా మిగిలిన వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ నెల 6వ తేదీ వరకూ గడువు ఉంది. ఇప్పటి వరకూ దరఖాస్తు చేసిన వారి ప్రాథమిక పరిశీలన పూర్తయిన వాటి వివరాలను విజయవాడ పౌర సంబంధాల శాఖ కమిషనర్ తదుపరి పరిశీలన కోసం జాబితాను మాకు పంపారు. ఈ జాబితాలో పేర్లు ఉన్న వారు ఆన్‌లైన్ దరఖాస్తు సంతకం చేసిన హార్డు కాపీని, దరఖాస్తుదారు ఆధార్ కార్డు కాపీ (దానిపై ప్రస్తుత కాంటాక్ట్ అడ్రస్, కాంటాక్ట్ ఫోన్ నంబరు తప్పని సరిగా రాయాలి) దరఖాస్తుదారు భార్య లేదా భర్త ఆధార్ కార్డు కాపీ, దరఖాస్తుదారు 2023-24 అక్రిడిటేషన్ కార్డు కాపీలను జతపరచి నిర్దేశించిన గడువులోగా మా కార్యాలయంలో అందజేయాలి.

ఇళ్ల స్థలాలు ఇచ్చే ప్రక్రియ ఎంతవరకు వచ్చింది.

ప్రభుత్వం జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చే కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. దీనిలో భాగంగా జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, డిఆర్ఒ, కాకినాడ, పెద్దాపురం ఆర్‌డిఒలు, సమాచార శాఖ డిడిగా నేను, ఎంపిక చేసిన ముగ్గురు జర్నలిస్టులు హౌస్ సైట్ కమిటీలో ఉన్నారు. గత నెల 29న మొదటి సమావేశం జరిగింది. హౌస్ సైట్స్ గుర్తించి మంజూరు ప్రక్రియ వేగవంతంగా చేయాలని జిల్లా కలెక్టర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అందిన దరఖాస్తులను కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీ పరిశీలించి అర్హతలను గుర్తిస్తుంది.

బస్సు పాసులు గడువు ఎప్పటి వరకు పెంచారు.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు మంజూరు చేసిన జర్నలిస్టుల బస్సు పాసులు గడువు డిసెంబరు 31తో ముగిసింది. మరో ఏడాది పాటు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఆర్‌టిసి అధికారులకు ఇప్పటికే జర్నలిస్టుల జాబితాను పంపించాము. జనవరి 1 నుంచి ఆర్‌టిసి అధికారులు బస్సు పాసులు జారీ చేస్తారు.

వర్కింగ్ జర్నలిస్టు హెల్త్ స్కీమ్ ఎలా అమలవుతుంది.

అక్రిడిటేషన్ కార్డు పొందిన ప్రతి వర్కింగ్ జర్నలిస్టుకూ ఈ హెల్త్ స్కీమ్ వర్తిస్తుంది. ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకున్న 125 మంది కొత్తవి, రెన్యూవల్ చేసుకున్న వారికి కార్డులు జారీ చేశాము. ఇంకా మిగిలిపోయిన వారి జర్నలిస్టుల కాంట్రిబ్యూషన్ రూ.1,250తో చలానా తీసుకుని సంబంధిత వివరాలు అందజేసిన వారికి హెల్త్ కార్డులు అందజేస్తాము. ఇవి మార్చి 31 వరకూ పని చేస్తాయి. మళ్లీ ఏప్రిల్ నుంచి వచ్చే మార్చి వరకూ మళ్లీ చలానా తీసుకోవాల్సి ఉంటుంది. జర్నలిస్ట్ ఆరోగ్య బీమా పథకం జర్నలిస్ట్, వారి భార్య/భర్త, పిల్లలు, జర్నలిస్టుపై ఆధారపడిన తల్లిదండ్రులకు వర్తిస్తుంది. వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్ స్కీం ప్రీమియం రూ.2,500 కాగా ఇందులో ప్రభుత్వం రూ.1,250 చెల్లిస్తోంది.

జిల్లాలో అక్రిడిటేషన్లు ఎంతమందికి ఇచ్చారు.

ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం కాకినాడ జిల్లాలో కలెక్టర్ కృతికా శుక్లా చైర్మన్‌గా ఉన్న కమిటీ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు వివిధ సంస్థల పరిధిలో 506 అక్రిడిటేషన్లు మంజూరు చేశాం. జిఒ ప్రకారం ఇంకా అర్హత ఉన్నవారు దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి మంజూరు చేస్తాము. ఫ్రీలాన్స్ కోటాలో కూడా కొంతమంది జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు అందజేశాం.



ఆర్.నారాయణమూర్తి పుట్టిన రోజు

ప్రజాశక్తి- రౌతులపూడి

సినీ దర్శక నిర్మత, పీపుల్ స్టార్ ఆర్ నారాయణమూర్తి పుట్టిన రోజు వేడుకలను ఆదివారం మండల కేంద్రమైన రౌతులపూడి మార్కెట్ సెంటర్‌లో ఆయన బంధువులు రౌతులపూడి యూత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి అభిమానులకు పంచారు. ఈ కార్యక్రమంలో నారాయణమూర్తి సోదరుడు రెడ్డి బుల్లబ్బాయి పలువురు యువత పాల్గొన్నారు.

ఘనంగా ఉయ్యాల తాళ్ల ఉత్సవం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం-జగ్గంపేట రహదారిలోని సత్తమ్మ అమ్మవారి ఆలయం వద్ద సంక్రాంతి పర్వదినాల్లో నిర్వహించే జాతర సందర్భంగా ఆదివారం అమ్మవారి ఉయ్యాల తాళ్ల ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఉయ్యాల తాడి చెట్లను ఊరేగింపుగా అమ్మవారి ఆలయం వరకు తీసుకువచ్చి ఉయ్యాల ఏర్పాటు చేశారు. ఈ ఉత్సవంలో ముఖ్యఅతిథిగా మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ పాల్గొన్నారు. ఈ ఉత్సవం పొడవునా డప్పుల దరువులు, గరగ నృత్యాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలో వైస్ చైర్మన్ సాయి ప్రసాద్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఆసాదులు పప్పుల నాగరాజు, పప్పుల సత్తిబాబు పాల్గొన్నారు.

ఘనంగా కనకమహాలక్ష్మి గ్రామోత్సవం

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సామర్లకోట బళ్ల మార్కెట్ సెంటర్‌లో ఉన్న కనకమహాలక్ష్మి అమ్మవారి మార్గశిర మాస వార్షిక బ్రహ్మోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు సన్నిధి రాజు అంజిబాబు ఆధ్వర్యంలో పూజలు చేశారు. రథోత్సవంలో గరగ నాట్య బందం, రామదండు బ్యాండ్ మేళాలు చూపరులను ఆకట్టుకున్నాయి. గ్రంధి వాసు, పెద్దిరెడ్డి శ్రీనివాసు, గోవిందు కారుకొండ వెంకటేశ్వరరావు, పెద్దిరెడ్డి సూర్యనారాయణ, బొండా సత్యనారాయణ, ఆట్ల సత్తిబాబు, కంచర్ల తాతాజీ, పాల్గొన్నారు.

వేడకగా మురారి దుర్గమ్మ జాతర

ప్రజాశక్తి-గండేపల్లి

మురారి గ్రామ శివారులో మామిడి తోటలో ఉన్న దుర్గమ్మ అమ్మవారి జాతర ఆదివారం ఘనంగా జరిగింది. ఈ తీర్థ:లో వేల సంఖ్యలో ప్రజలు పాల్గొని మొక్కుబడులు తీర్చుకునాన్రు. జగ్గంపేట సిఐ లక్ష్మణరావు, ఎస్ఐలు ఎన్.రామకృష్ణ, వై.గణేష్ కుమార్ బందోబస్తు నిర్వహించారు.

అమృత్ భారత్ రైలుకు ఘన స్వాగతం

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

ప్రధాని నరేంద్ర మోడీ శనివారం మాల్దా జంక్షన్‌లో ప్రారంభించిన అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ఆదివారం సామర్లకోట చేరుకుంది. ఈ సందర్భంగా బిజెపి నాయకులు సామర్లకోట రైల్వే స్టేషన్‌కు చేరుకుని స్టేషన్ మేనేజర్ రమేష్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. పేద ప్రజలు వేగవంతమైన ప్రయాణాన్ని సాగించేందుకు వీలుగా ఈ రైలును ప్రారంభించినట్టు బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేటుకూరి సూర్యనారాయణ రాజు తెలిపారు. రైలు పైలెట్లకు సాలువా కప్పి పూలమాలతో సత్కరించారు. వైడి.రామారావు, ఎంఎల్‌సి కర్రి పద్మశ్రీ, తుమ్మల పద్మజ, మాలకొండయ్య, రైల్వే ఎడిఇ ఎన్.శివ ప్రసాద్, రామస్వామి పాల్గొన్నారు.



నూతనంగా ఎన్నికైన కార్యవర్గం

వాసవి క్లబ్ కపుల్స్ సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి-ఏలేశ్వరం

వాసవి క్లబ్ ప్లాటినం కపుల్స్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు క్లబ్ గవర్నర్ గోకవరపు సుభాష్ అన్నారు. ఈ మేరకు ఏలేశ్వరం నూతన కార్యవర్గ ఎంపిక కార్యక్రమానికి ఆదివారం ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నావారిని ప్రోత్సహించే ఉద్దేశంతో ప్రతి సంవత్సరం నూతన కార్యవర్గం ఎంపిక చేస్తున్నామన్నారు. గతంలో సేవలందించిన వారికి మండల జిల్లా రాష్ట్రస్థాయి పదవులు నియామకాలు ఉంటాయన్నారు. పేదలకు విపత్కర పరిస్థితులలో సేవలందించడమే క్లబ్ ముఖ్య ఉద్దేశం అన్నారు. నూతన అధ్యక్ష కార్యదర్శులుగా కొత్త సమీర్ ఉమా, ఊర మణికంఠ సుప్రియ, కోశాధికారిగా మండ వీరేష్ జ్యోతి ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో వైస్ గవర్నర్ మానేపల్లి బంగార్రాజు, డిస్ట్రిక్ట్ ఇన్చార్జ్ వెల్లంపల్లి మురళి, మామిడిపాక సతీష్ తదితరులు ఉన్నారు.



శిథిలావస్థకు చేరిన పశువుల ఆసుపత్రి

శిథిలావస్థలో పశువుల ఆసుపత్రి

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

ప్రారంభించిన 7 సంవత్సరాలకే శిథిలవస్థకి చేరింది పశువుల ఆసుపత్రి. మండల కేంద్రమైన జగ్గంపేటలో పశువుల ఆసుపత్రి భవనం 7 ఏళ్లకే శిథిలావస్థకు చేరుకుంది. ఆస్పత్రిలో పనిచేస్తున్న ఉద్యోగులు ఈ భవనం ఎప్పుడు ఏ రకంగా పెచ్చులూడతాయనే భయంతో ఉద్యోగాలు చేస్తున్నారు. జగ్గంపేట, గండేపల్లి మండలాలకు ప్రధాన ఆసుపత్రిగా ఉన్న పశువుల ఆసుపత్రి శిథిలావస్థకు చేరుకోవడంతో నూతన భవనం నిర్మించేందుకు గత 2011లో మాజీ మంత్రి తోట నరసింహం రూ.13.38 లక్షల నిధులతో శంకుస్థాపన చేశారు. ఆ భవనాన్ని 2016 సెప్టెంబర్‌లో ప్రారంభించారు. ఇప్పటికీ ఆ భవనం నిర్మించి ఏడేళ్లుఅయ్యింది. ఇప్పుడు ఆ భవనాన్ని చూస్తే ఎక్కడికక్కడ స్లాబ్ పెచ్చులు ఊడి పోవడంతో పాటు, గోడలు బీటలు వారాయి. నిర్మించిన కాంట్రాక్టర్ నాణ్యత లోపంతో నిర్మించడంతో బీటలు వారాయని పలువురు పేర్కొంటున్నారు.

ఎంఎల్ఎ అశోక్ శుభాకాంక్షలు

ప్రజాశక్తి - యానాం

యానాం ప్రజలకు, కార్యకర్తలకు, అభిమానులకు అందరికీ యానాం ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ 2024 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరంలో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు. సోమవారం ఉదయం నుంచి తన కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటానని అయితే ప్రజలెవరూ కూడా శాలువాలు అలాగే పూలదండలు తీసుకురావద్దని మనవి చేశారు. ఈ విషయాన్ని ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు.

రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యత



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపి భరత్, కో-ఆర్డినేటర్ చందన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

రాజమహేంద్రవరం రూరల్ మండల పరిధిలోని అనేక గ్రామాలలో రహదారుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎంపి మార్గాని భరత్ రామ్ అన్నారు. రూరల్ పరిధిలోని హుకుంపేట నుంచి బాలాజీ పేట వెళ్ళే ఈస్ట్రన్ రైల్వే రహదారి 1.25 కిలోమీటర్ల మేర అభివృద్ధి పనులకు రూరల్ నియోజకవర్గ వైసిపి కో-ఆర్డినేటర్ చందన నాగేశ్వర్‌తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 2 నుంచి ప్రారంభించి పది రోజుల్లో పూర్తి చేస్తారని చెప్పారు. అలాగే ఆవ ప్రాంతంలో డ్రెయినేజీ నిర్మాణం, బాలాజీ పేట నుంచి నేషనల్ హైవే వరకూ రహదారి అభివృద్ధి పనులు త్వరలో చేపట్టబోతున్నట్లు తెలిపారు. బాలాజీ పేట నుంచి మోరంపూడి ఎఫ్ఒబి రోడ్డును అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. హుకుంపేట కల్వర్టు నిర్మాణానికి రూ.70 లక్షలు మంజూరు అయ్యాయని, త్వరలోనే ఆ పనులు కూడా ప్రారంభిస్తామని తెలిపారు.

సిఐకి లైఫ్ అచీవ్‌మెంట్ అవార్డు

ప్రజాశక్తి - నిడదవోలు

గత ఏడాది జనవరిలో తీరుగూడెంలో తేనెటీగల దాడి నుంచి పిల్లలను తన ప్రాణాలకు తెగించి కాపాడిన నిడదవోలు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.వెంకటేశ్వర్‌రావుకు లైఫ్ అచీవ్‌మెంట్ అవార్డు దక్కింది. జిల్లా ఎస్‌పి పి.జగదీష్ చేతుల మీదుగా ఈ అవార్డును ఆయన అందుకున్నారు. అలాగే గత ఏడాదిలో మిస్సింగ్ కేసుల్లో ఛేధించడంలోనూ, శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యల్లో భాగంగా బైండోవర్ కేసులు నమోదు చేసిన ఎస్ఐ పి.నాగరాజుకి ప్రతిభ అవార్డు లభించింది. క్రిమినల్ కేసుల్లో ముద్దాయిలు కోర్టుకు హాజరవ్వకుండా తప్పించుకు తిరుగుతున్న వారిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపర్చి తన ప్రతిభను చాటుకున్న ఎఎస్ఐ డి.కోటేశ్వరావు, పిసి పి.శ్రీనివాస్ జిల్లా ఎస్‌పి జగదీష్ చేతుల మీదుగా అవార్డులను అందుకున్నారు. ఉత్తమ అవార్డులను అందుకున్న అధికారులు, సిబ్బందిని పలువురు అభినందనలు తెలిపారు.



అవార్డును స్వీకరిస్తున్న సిఐ వెంకటేశ్వరరావు



అవార్డును స్వీకరిస్తున్న ఎస్ఐ నాగరాజు

అక్రమంగా వాలంటీర్ల తొలగింపు

అన్యాయం చేశారంటూ ఆవేదన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

రాజమహేంద్రవరం రూరల్ ధవళేశ్వరం సచివాలయం 1,2,3 పరిధిలో విధులు నిర్వహిస్తున్న 35 మంది వాలంటీర్లను విధులు నుంచి తొలగించారు. ఈనెల ధవళేశ్వరం సచివాలయం సెక్రటరీ డి.సూరిబాబు డిసెంబర్ 28న సమావేశం ఉందని, వాలంటీర్లు, సచివాలయం సిబ్బంది ఉదయం 10 గంటలకు రావాల్సిందిగా వాట్సాప్‌లో వాయిస్ మెసేజ్ పెట్టారు. దీంతో వారందరూ సమావేశానికి హాజరయ్యారు. ఈ సమావేశంలో 35 మంది వాలంటీర్ల పేర్లు చదివి, విధుల నుంచి తొలగిస్తున్నామని, వారి నుంచి ప్రభుత్వం అందించిన సెల్ ఫోన్లు, డివైజ్‌లు స్వాధీనం చేసుకోవాలని సచివాలయ సిబ్బందికి చెప్పారు. కారణం చెప్పకుండా ఎలా తొలగిస్తారని? వాలంటీర్లు ప్రశ్నించారు. సమ్మె చేస్తున్నట్లు సంతకాలు పెట్టడంతో విధుల నుంచి తొలగిస్తున్నాని తెలిపారు. ఎవరు సంతాకాలు పెట్టారో చూపాలని అడిగినా చూపించలేదు. ఎంపిడిఒ కార్యాలయం నుంచి తమకు 35 మంది పేర్లతో లిస్టు వచ్చిందని, వారి తొలగించాలని ఆదేశాలొచ్చాయని పంచాయతీ సెక్రటరీ తెలిపి వెళ్లిపోయారు. దీంతో తొలగింపు లిస్టులో ఉన్న వాలంటీర్లు 29న వైసిపి రూరల్ కో-ఆర్డినేటర్ చందన నాగేశ్వరరావును కలిశారు. ఈ విషయం తన చేతుల్లో లేదని, తానేమీ చేయలేననిచేతులు దులుపుకున్నారు. దీంతో చేసేది లేక వారు కలెక్టరేట్‌కు వెళ్లారు. అక్కడ జెసి వద్దకు వెళ్లమంటే అక్కడికీ వెళ్లారు. జెసి కార్యాలయంలో ఎంపిడిఒను కలవాలని చెప్పి తిప్పించుకున్నారని, కనీసం సమాధానం కూడా ఇవ్వలేదని వాపోయారు.

నాలుగున్నరేళ్లుగా నిబద్ధతతో, నిజాయితీగా పనిచేస్తున్న తమకు అన్యాయం జరిగిందని వాపోయారు. కరోనా లాంటి విపత్కర పరిస్థితిల్లోనూ ప్రాణాలకు తెగించి విధులు నిర్వహించామని గుర్తు చేశారు. అడ్డదారుల్లో తొలగించడం అన్యాయమన్నారు. కనీసం గోడు వెళ్లబుచ్చుకునే అవకాశం కూడా లేకుండా పోయిందని వాపోయారు. మెమోలు ఇవ్వకుండా సచివాలయం సిబ్బందితో ఫోన్ చేయించి మెమోలు వచ్చాయని వాటిపై సంతకం పెట్టాలని, లేని పక్షంలో తామే సంతకం పెట్టుకొని కలెక్టర్‌కు పంపుతామంటు బెదిరింపుకాల్స్ వస్తున్నాయని తెలిపారు. మెమోపై కార్యదర్శి సంతకం 27న చేసినట్టు ఉందని, తమకు 30న మెమో ఇచ్చి 24 గంటల్లోగా రిప్లయ్ లేదంటూ తొలగించడం ఎంతవరకూ సబబు అని వాపోయారు. ఇప్పటికైనా తమకు న్యాయం చేయాలని వారు వేడుకుంటున్నారు.

3న జరిగే సమ్మెకు సిద్ధం కండి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

మున్సిపల్ కార్మిక సంఘాల జెఎసి పిలుపు మేరకు జనవరి 3 నుంచి జరిగే సమ్మెకు కార్మికులంతా సిద్ధం కావాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్(ఎఐటియుసి) జిల్లా నాయకులు తాటిపాక మధు, కూండ్రపు రాంబాబు పిలుపునిచ్చారు. యూనియన్ జిల్లా సమావేశం ఆదివారం నగరంలోని తాడితోటలో సమావేశం అయ్యింది. యూనియన్ నాయకుడు సంగిరెడ్డి రమణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో వివిధ మున్సిపల్, కార్పొరేషన్, నగర పంచాయతీల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్, పర్మనెంట్ పారిశుధ్య కార్మికులు ఇంజనీరింగ్ విభాగంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కార్మికుల, స్కూల్స్ స్వీపర్లు, డ్రైవర్లు, టాయిలెట్ వర్కర్స్, పార్క్ వర్కర్ల సమస్యల పరిష్కరించాలని ఎఐటియుసి, వైఎస్ఆర్‌టియు, టిఎన్‌టియుసి స్వతంత్ర కార్మిక సంఘాలు జెఎసిగా ఏర్పడి 3 నుంచి సమ్మెలోకి వెళ్లాలని నిర్ణయించినట్లు చెప్పారు. మున్సిపల్ రంగంలో అవుట్ సోర్సింగ్‌లో పని చేస్తున్న పారిశుధ్య, ఇంజనీరింగ్ విభాగ ఉద్యోగ, కార్మికులను, డ్రైవర్లను, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కార్మికులను, పార్కు వర్కర్లల, స్కూల్స్ పేపర్లను, టాయిలెట్ వర్కర్లను పర్మినెంట్ చేయాలని, అవుట్ సోర్సింగ్‌ఉద్యోగ, కార్మికులను పర్మినెంట్ చేసేంతవరకు ధరల అనుగుణంగా కనీస వేతనాలు రూ.26 వేల ఇవ్వాలని, పర్మినెంట్ పాశుధ్య మరియు ఇంజనీరింగ్ కార్మికుల జిపిఎఫ్ ఖాతాలు సాంకేతిక సమస్యలు అంటూ ప్రభుత్వం వాయిదా వేయకుండా సత్వరమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆయా డిమాండ్ల సాధన కోసం జరుగుతున్న సమ్మెలో కార్మికులంతా ఐక్యంగా పోరాడాలని వారు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో దుర్గమ్మ, అల్లం వెంకటేశులు, బంగారు నాగేశ్వరావు, ముత్యాలు మురళీ, అల్లం బాలు, కాకి శారద, ముత్యాలు నంద కిషోర్ తదితరులు పాల్గొన్నారు



యూనియన్ సమావేశంలో మాట్లాడుతున్న తాటిపాక మధు

దత్తత విద్యార్థికి ఆదిరెడ్డి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

దత్తత విద్యార్థికి రెండో దఫా ఫీజును టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ తమ భవాని చారిటబుల్ ట్రస్ట్ తరపున ఆర్థిక సాయాన్ని ఆదివారం అందించారు. ఆక్స్‌ఫర్డ్ స్కూల్లో 5వ తరగతి చదువుతున్న ఎం.సుకుమార్‌కు స్థానిక తిలక్ రోడ్డులోని టిడిపి అర్బన్ కార్యాలయంలో ఫీజుకు సంబంధించిన నగదును అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థుల సంబంధించి వారికి ఫీజు చెల్లింపు విషయంలో తమ ట్రస్ట్ ముందు ఉంటుందన్నారు. విద్యకు తమ ట్రస్ట్ అధిక ప్రాధాన్యత ఇస్తుందని, అందుకే ప్రతి ఏటా అనేక మంది విద్యార్థులకు ట్రస్ట్ తరపున ఆర్థిక సహాయం చేయడంతో పాటు కావలసిన వారికి ఉచితంగా నోట్ బుక్స్ అందజేస్తున్నామని తెలిపారు. అంతేకాకుండా తమ ట్రస్ట్ తరపున ప్రతియేటా నెలకు రెండు చొప్పున ఉచిత మెగా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని వివరించారు. భవిష్యత్తులో కూడా తమ ట్రస్ట్ తరపున సేవా కార్యక్రమాలు ఇలాగే నిర్వహిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో నగర ఎస్‌సి సెల్ ప్రధాన కార్యదర్శి మామిడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థికి ఆర్థిక సాయాన్ని అందిస్తున్న ఆదిరెడ్డి

క్రీడలు జీవితంలో భాగం కావాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

క్రీడలు ప్రతీ ఒక్కరి జీవితంలో ఒక భాగం కావాల్సిన అవసరం ఉందని ఎంపి మార్గాని భరత్ రామ్ అన్నారు. ఆర్ట్స్ కళాశాల క్రీడా మైదానంలో నిడ్జామ్ జిల్లా జూనియర్ అథ్లెటిక్స్ మీట్ ప్రారంభ సూచికగా ఆదివారం ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడా పతాకాన్ని ఆవిష్కరించారు. క్రీడా జ్యోతిని వెలిగించి, గాలిలోకి బెలూన్లు వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు జీవితంలో ఒక భాగం కావాలని, జాతీయ అంతర్జాతీయ క్రీడాకారులుగా గుర్తింపు పొందాలని పిలుపునిచ్చారు. గతంలో క్రీడల పట్ల ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరించినా ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నాయని అన్నారు. ఉద్యోగం కోసం కాకుండా రాష్ట్రానికి, ఉన్న ఊరుకీ గుర్తింపు తెచ్చేలా ఒక లక్ష్య సాధనతో క్రీడలలో నైపుణ్యం పెంపొందించుకోవాలని సూచించారు. ఒలంపిక్స్‌లో పతకాలను దక్కించుకోవడమే లక్ష్యంగా విద్యార్థి దశ నుంచే అథ్లెటిక్స్, క్రీడలలో రాణించాలని కోరారు. ముందు యువత ఫిట్‌గా ఉండాలన్నారు. అప్పుడే యంగ్ ఇండియాగా గుర్తింపు వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు రాజేంద్ర, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.



క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న ఎంపి భరత్

వైసిపి మండల ప్రధాన కార్యదర్శిగా బాలరాజు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్



వైసిపి రూరల్ మండల ప్రధాన కార్యదర్శిగా ధవలేశ్వరం గ్రామానికి చెందిన శ్రీరంగం బాలరాజు నియమితులయ్యారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ తనకు మండల ప్రధాన కార్యదర్శిగా నియమించిన సిఎం జగన్మోహన్ రెడ్డికి, తనకు ఈ పదవి రావడానికి కృషి చేసిన నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ విజయానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు.

చాగల్లులో న్యూ ఇయర్ సందడి

ప్రజాశక్తి - చాగల్లు

నూతన సంవత్సరం వేడుకల సందర్భంగా స్థానిక మెయిన్ బజార్‌లో సందడి వాతావరణం నెలకుంది. ఒకపక్క వస్త్ర దుకాణాలు వినియోగదారులతో కిక్కిరిసిపోయాయి. మధ్యాహ్నం నుంచే బిర్యానీ సెంటర్లు ఆఫర్లతో మోతమోగించాయి. ఒక బిర్యాని కొంటే మరొకటి ఫ్రీ అంటూ బోర్డులు ఏర్పాటు చేశారు. వీటికితోడు డ్రింక్‌లను ఉచితమని ప్రకటన చేయడంతో కొనుగోలుదారులు క్యూ కట్టారు.



బిర్యాని సెంటర్ వద్ద క్యూకట్టిన వినియోగదారులు